మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట






ప్రజా పరిషత్ కార్యాలయం



మురుగు నీటితో నిండిన గుంట

- పనులు సాగేదెట్ల..? • గ్రామపంచాయతీలలో డబ్బులు లేవు..పనులెట్లా?
- అత్యవసర పనులకు బ్రేక్ • నిలిచిన పారిశుధ్యం పనులు
- విజృంభిస్తున్న విషజ్వరాలు • కనిపించని ప్రత్యేక అధికారులు

# నిధులు నిల్

**మాగనూర్, ఆగస్టు 16 ప్రభాతవార్త :** మాగనూర్ మండలంలో పారిశుధ్యం లోపించింది. గ్రామాలలో సమస్యలు ఉంటే పంచాయతీ కార్యదర్శిలు స్పందించి జిపి నిధుల ద్వారా సమస్యకు పరిష్కారం చూపేవారు.కానీ ప్రస్తుతం జిపిలలో డబ్బులు లేకపోవడంతో వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.గ్రామాలలో మైనర్ పనులు చేయాలంటే పంచాయతీ సెక్రెటరీ సొంత డబ్బులు పెట్టాల్సిందే. అత్యవసర పనులను కొంతమంది పంచాయతీ సెక్రెటరీలు సొంత డబ్బు వెచ్చించి చిన్న చిన్న పనులు పూర్తి చేస్తున్నారు. ఇంకొందరైతే జిపిలో డబ్బులు లేవని, అత్యవ సరం అనిపిస్తే గ్రామస్తుల సొంత డబ్బులు పెట్టి సమస్యను పరిష్కరించుకోవాలని ఉచిత సలహాలిచ్చి, బిల్లులు తర్వాత చేస్తామంటున్నారు. మాజీ సర్పంచుల నుంచి పనులు చేపిద్దా మంటే,చేసిన పనులకి బిల్లులు లేక తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గ్రామాలలో ఎదురవుతున్న సమస్యలతో ప్రజలు మాత్రం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేక అధికారులు ఎక్కడ? సర్పంచుల పదవీకాలం ముగిసిన వెంటనే గ్రామపంచాయతీలలో సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. గ్రామాలలో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్న నేపథ్యంలో పరిశీలించి,పరిష్కార మార్గాలు చూపాల్సిన ప్రత్యేక అధికారులు గ్రామాలలో కనబడలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ సభలు, మీటింగ్లకు హాజరవుతున్నారు తప్ప గ్రామానికి ప్రత్యేక అధికారులు చేసిందేమీ లేదని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రత్యేక అధికారులు స్పందించి గ్రామాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**ట్రాక్టర్ డీజిల్‌కు సొంత డబ్బులు..**

గ్రామాలలో పరిశుభ్రతకు అలవాటు పడ్డ ప్రజల కోసం నిత్యం చెత్తను సేకరించే గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌కు డీజిల్ పోసేందుకు డబ్బులు జిపిలో లేవు. తప్పని పరిస్థితుల్లో సెక్రెటరీలే సొంత డబ్బులతో డీజిల్ పోసి ట్రాక్టర్‌ను నడిపిస్తున్నారు. ప్రజల సమస్యలకుసమాధానం చెబుతూనే సాధ్యమైనంత చిన్న చిన్న పనులు సొంత డబ్బులతోనే సెక్రెటరీలు చేస్తున్నారు.

**లోపించిన పారిశుధ్యం**

అతిభారీ వర్షాల కారణంగా మాగనూర్ మండల కేంద్రంలో వర్షపు నీరు ఇళ్ల మధ్యలో నెలల తరబడి నిలిచిపోయింది. దీంతో దుర్వాసన వెదజల్లుతుంది. చుట్టుపక్కల ఇండ్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.దోమలను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. డ్రైనేజీలలో ఫాగింగ్, నీటి విలువ ప్రాంతాలలో బ్లీచింగ్ పౌడర్ చదవడం వంటి పనులను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. దోమల వల్ల డెంగ్యూ ,మలేరియా,విష జ్వరాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గ్రామాలలో లోపించిన పారిశుధ్యంపై అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకు వెళ్లిన ఫలితం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**తాగునీటి సమస్య తీర్చండి**

వర్కుర్ గ్రామంలో రెండు, మూడవ వార్డులలో పది రోజులుగా తాగునీటి సరఫరా లేదు. గ్రామ సెక్రటరీకు మా వార్డులో తాగునీరు వస్తలేవు అని చెబితే, పైపులైన్ ప్రాబ్లం వల్ల వస్తలేవని, మీ సొంత డబ్బులు పెట్టుకొని సమస్యను పరిష్కరించుకుంటే తర్వాత బిల్లు ఇస్తామంటున్నారు.ఉన్నతాధికారులు స్పందించి మా సమస్యను పరిష్కరించాలి.

\- కృష్ణయ్య , వర్కుర్ గ్రామం



**తక్షణమే పనులు చేపట్టి తాగునీరు అందిస్తాం**

ఇప్పటివరకు తాగునీటి సమస్య నా దృష్టికి రాలేదు.గ్రామాన్ని సందర్శించి,సమస్యను పరిశీలిస్తా..సమస్య ఉంటే తక్షణమే పనులు చేపట్టి రెండు, మూడవ వార్డుకు తాగునీరు అందిస్తాం.

\- శ్రీనివాసులు, ఎంపీడీవో మాగనూర్





శ్రీశైలం డ్యాం నుంచి విడుదలవుతున్న వరద

# ప్రాజెక్టులకు జలకళ..

- శ్రీశైలం డ్యాంకు పెరుగుతున్న వరద
- 1.89లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 5గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- జూరాల 6గేట్లు ఎత్తివేత

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 16, ప్రభాతవార్త:** ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులకు జలకళ సంతరించుకున్నది. శ్రీశైలం జలాశయానికి వరద క్రమంగా పెరుగుతున్నది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు సుంకేసుల, జూరాల డ్యాంల నుంచి భారీగా వరద వచ్చి చేరుతున్నది. శనివారం సాయంత్రం 6గంటల సమాచారం మేరకు శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 37,419క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 40,863క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 30,653క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాం గేట్ల ద్వారా 1,33,720క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకుగానూ 882.10అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 199.7354టీఎంసీలకు చేరింది. డ్యాంకు 1,89,169క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. విద్యుత్ ఉత్పత్తి కోసం 65,824క్యూసెక్కులు విడుదల చేయగా కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. శ్రీశైలం డ్యాం 5గేట్లు 10అడుగుల మేర ఎత్తి సాగర్‌కు విడుదలవుతున్నారు. ఇదిలా ఉండగా ఉమ్మడి పాలమూరు వరప్రదాయిని జూరాలకు ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులకు భారీ వరద వచ్చి చేరుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాలకు జూరాలకు వరద పోటెత్తుతున్నది. దీంతో 6గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయానికి 95,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.322టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్‌హౌస్‌కు 37,419క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 40,836క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జూరాల నుంచి 78,638క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

# చౌడేశ్వరి దేవి ఆలయానికి రోడ్డుమర్మత్తులు చేపట్టండి

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం పాత సుగురు గ్రామంలో
శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి ఆలయానికి వెళ్లే దారికి రోడ్డు పనులు
చేపట్టాలని సుగుర్ గ్రామస్తుల విజ్ఞప్తి

2



గుంతల మాయంగా ఉన్న రోడ్డు

# లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే

**- ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా పరిష్కరిస్తాం: నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 16 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ మండలం గుడిపల్లి గ్రామంలో భారీ వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో గ్రామంలోని పలు మరియు కాలనీల్లో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పర్యటించి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఎన్నో ఏండ్లుగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను గుడిపల్లి కాల్వకు లైనింగ్ లేకపోవడం వల్ల వాళ్ళ ఇళ్లలోకి మరియు కాలనీలలోకి నీరు ఊరుతుందని గ్రామస్థులు ఎమ్మెల్యేకు విన్నవించడంతో దానికి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి కాలువ లైనింగ్ సంబందించిన అంచనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. తొందర్లోనే ఇరిగేషన్ మంత్రి గారినీ ప్రత్యేకంగా కలిసి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను కూడా పునరుద్ధరించాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎక్కడా కూడా ఇబ్బంది పడవద్దని వారు చెప్పారు. అదే విధంగా భారీ వర్షాల కారణంగా చర్ల తిర్మలాపూర్ వెళ్ళే రోడ్డు మీదకు వరదనీరు చేరడంతో గ్రామానికి రాకపోకలు బంద్ కావడంతో ఎమ్మెల్యే స్వయంగా వెళ్ళి పరిశీలించి అందుకు ప్రత్యామ్నాయంగా చర్ల తిర్మలాపూర్ నుంచి చర్ల ఇటిక్యాల మీదుగా నాగర్‌కర్నూల్ పట్టణానికి వచ్చే రోడ్డును మరమ్మతులు చేసి గ్రామస్థులకు రోడ్డు సదుపాయం కల్పించాలని పంచాయతీరాజ్ శాఖ ఈఈ విజయ్ కుమార్ ఆదేశించారు. నాగనుల్ సమీపంలో భారీ వర్షాల కారణంగా వచ్చిన వరద నీటితో గత 3 రోజులుగా రాకపోకలు బంద్ అవ్వడంతో ఎమ్మెల్యే స్వయంగా వెళ్ళి పర్యటించి అక్కడ ఎన్నో ఏండ్లుగా ఉన్న ఇబ్బందిని చూసి సంబంధిత అధికారులతో మాట్లాడారు. అక్కడలో లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన అంచనాలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా కొత్త బ్రిడ్జి మంజూరు చేయించి నిర్మిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు నాగనుల్ గ్రామ ప్రజలు సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు తదితరులు ఉన్నారు.





లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

# స్వయంభు శ్రీకృష్ణస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం సద్దలోనిపల్లి గ్రామంలో శనివారం స్వయంభు శ్రీకృష్ణ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి



2



దర్శనానికి క్యూలో నిలబడ్డ భక్తులు



ఉప్పునుంతలలో గుంపు గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

# వీధి కుక్కల బెడద

**ఉప్పునుంతల, ఆగస్టు 16,ప్రభాతవార్త;** గ్రామాలలో వీధి కుక్కల బెడద అధికమైంది. కుక్కల బెడదతో చాలామంది బెంబేలెత్తు తున్నారు. గ్రామాలలో గ్రామపంచాయతీ సర్పంచులు లేకపోవడం, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రత్యేక అధికారుల పాలనతో ఎవరు చెప్పుకోవాలని తెలియని పరిస్థితి నెలకొంది. కుక్కలు చిన్నపిల్లలు బయటికి వెళ్లాలంటే జంకాల్సిన అవసరం ఏర్పడింది. గ్రామాలలో ఇండ్ల ముందు గుంపులు గుంపులుగా వెళ్లి హంగామా చేస్తున్నాయి. ముఖ్యంగా మండల కేంద్రమైన ఉప్పునుంతల లో లక్ష్యాన్ని మించి గుంపులుగా ఏర్పడి చిన్న పిల్లలు, లేగ దుడలపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. గ్రామంలో తమ సమస్య ఎవరు చెప్పుకోవాలో తెలియక గ్రామస్తులు అయోమయంలో పడ్డారు. ప్రజా పాలన అంటే ఇలా ఉంటుందా అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. కనీసం గ్రామాలలో వీధి కుక్కల బెడద నుంచి రక్షి ంచాల్సిన వారు లేకపోలేదు. పంచాయతీ కార్యదర్శులకు సమస్యలు వివరిస్తే మాకేం తెలియదు అన్న ధోరణి లో వారు ఉన్నారు. గ్రామాలలో వీధి కుక్కల బాధ తట్టుకోలేక ఇండ్ల ముందు కర్రలు పట్టుకొని ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వీధి కుక్కల బెడద నుంచి కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు ఏ కరువు పెట్టుకుంటున్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరం

**▶▶ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి**

**అడ్డాకుల ఆగస్టు 16, ప్రభాతవార్త;** దేవరకద్ర నియోజకవర్గ క్యాంప్ ఆఫీస్ లోను శనివారం నాడు మండల పరిధిలోనిరాచాల గ్రామానికి చెందిన గొల్లతిరుపతయ్య గారికి 3లక్షల,35,000 వేల రూపాయలు. కందూర్ గ్రామానికి చెందిన బి. శంకరయ్య గారికి 1లక్ష,84,000 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వము ద్వారాలబ్ధిదారులకు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా కార్యదర్శి గంగుల విజయ మోహన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు తోట శ్రీహరి, రాచాల మాజీ సర్పంచ్‌తిరుపతయ్య, వేగనాద్, మన్సూరు, తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

# కన్నుల పండువగా కృష్ణాష్టమి

- అలరించిన చిన్నారుల వేషధారణ...
- శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 16 ప్రభాతవార్త:** ఎక్కడ శ్రీకృష్ణుడు ఉంటాడో ఆ ప్రాంతమంతా ఆనందమయంతో పిల్లపాపలతో కళకళలాడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కన్నుల పండుగగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కుర్వ యాదవ సోదరులు డీజే పాటలతో ఊరేగింపుతో ఘనంగా నిర్వహించారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈదమ్మ దేవాలయం నుంచి నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారి గుండా రామాలయం దేవస్థానానికి చేరుకొని చిన్నారులచేత ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు గోపబాలుడు, గోపికమ్మల వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి పాల్గొని కురువ యాదవ్ సోదరులకు శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.రాబోయే తరాలకు మన సాంస్కృతి సాంప్రదాయాలు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం నిజంగా సంతోషదాయకమైన విషయమని ఆనందం వ్యక్తం చేశారు. ఏ మతం వారి పండుగలైన శాంతియుత వాతావరణంలో కుల మతాలకు అతీతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించుకోవడం నాగర్కర్నూల్ జిల్లా ప్రత్యేకత అని అన్నారు. ముఖ్యంగా చిన్నారుల వేషాధారణ ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచారని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు. మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, ఉత్సవ కమిటీ సభ్యులు, యాదవ కమిటీ సభ్యులు, మహిళలు చిన్నారులు పాల్గొన్నారు.





చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



ఉత్సవాలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి


బాదం హరీష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## వాసవి క్లబ్ 2026 సంవత్సరం అధ్యక్షులుగా బాదం హరీష్

**కల్వకుర్తి, ఆగస్టు 16 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని వాసవిక్లబ్ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వాసవి క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షులు జూలూరి రమేష్ బాబు సమక్షంలో 2026వ సంవత్సరానికి నూతన అధ్యక్షులుగా బాదంహరీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షులుగా ఎన్నికైన బాదం హరీష్ మాట్లాడుతూ అందరి సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి మీ అందరి ఆదరాభిమానాలు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు జూలూరి రమేష్‌బాబు, వాసవి క్లబ్ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్, వనిత క్లబ్ కార్యవర్గ సభ్యులు, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## భారత మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళి


మాజీ ప్రధాని వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు16 ప్రభాతవార్త:** భారత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమాన్ని నాగర్‌కర్నూల్ బిజెపి జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర గౌడ్ హజరై మాట్లాడుతూ వాజ్‌పేయి మధ్య ప్రదేశ్‌లోని గాల్వియర్ ప్రాంతంలో 1924 డిసెంబర్ 25న జన్మించారని, ఆయన బాల్యం నుంచే రాష్ట్రీయ స్వయంసేవ సంఘంలో సభ్యునిగా చేరి సంఘ ప్రచారంగా పనిచేశారని గుర్తు చేశారు. మన దేశానికి మూడుసార్లు ప్రధానమంత్రిగా పనిచేశారని, 1980లో భారతీయ జనతా పార్టీని స్థాపించారని,మరియు దానికి మొదటి అధ్యక్షునిగా ఆయనే వ్యవహరించారన్నారు. 1977లో మొరార్జీ దేశాయి ప్రధానిగా ఉన్న సమయంలో ఆయన విదేశాంగ మంత్రిగా పనిచేశారని, ఈయన ప్రధానిగా ఉన్న సమయంలోనే రాజస్థాన్‌లోని ప్రోగ్రామ్‌లో అణు పరీక్షలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. వాజ్‌పేయి పద్మ విభూషణ్ మరియు భారతరత్న అవార్డులు పొందినట్లు గుర్తు చేశారు. వాజ్‌పేయి 2018 ఆగస్టు 16న పరమ పదించారని, వారు చనిపోయిన తర్వాత కేంద్ర ప్రభుత్వం సుపరిపాలన దినోత్సవంగా ప్రకటించినట్లు తెలిపారు. అంతకు ముందు పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ సెక్రటరీ చందు, టౌన్ ప్రధాన కార్యదర్శులు బొట్టు శీను, జగదీశ్వర్ రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షులు రాము, నాయకులు సుధాకర్, సైదులు, చారి, బాలస్వామి, లక్ష్మారెడ్డి, సంజీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరం

◆ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

**వెల్దండ, ఆగస్టు 16 ప్రభాతవార్త:** అనారోగ్య బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసి ఒక వరమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని దుబ్బతండాకు చెందిన జర్పుల రాజుకు మంజూరైన రూ.2లక్షల 25 వేల ఎల్‌ఓసి చెక్కును హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బాధితుడి తరుపున దుబ్బ తండా శ్రీనునాయక్‌కు అందించారు. కార్యక్రమంలో గోళి సురేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## ఇంటర్ విద్యార్థులను బయటకు వేరే పాఠశాలలకు పంపించవద్దు


గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న బిఆర్‌ఎస్ నాయకులు ముంత మల్లయ్య యాదవ్

**వీపనగండ్ల ఆగస్టు 16, ప్రభాతవార్త:** వీపనగండ్లకు చెందిన ఎస్సి గురుకుల పాఠశాలలో ఇంటర్‌కు సంబంధించిన తరగతులను కొనసాగించకుండా వసతులు సరిగా లేవనే కారణంగా అడ్మిషన్లకు వచ్చిన విద్యార్థులను చేర్చుకొని ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నారు. దీనిపై శనివారం నాడు అక్కడికి వెళ్లి బారాస మండల సీనియర్ నాయకుడు ముంత మల్లయ్య యాదవ్, ఎమ్మార్పీఎస్ .జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు శనివారం కొత్తకోట గురుకుల పాఠశాల ను సందర్శించడం జరిగింది. అక్కడ ఉండే ప్రిన్సిపాల్, పాఠశాల ఉండే ఓనర్ తో మాట్లాడారు. ఇంటర్ విద్యార్థులను ఇతర ప్రాంతాలకు పంపించకుండ వసతులు కల్పించాలని కోరడంతో ఇంటి యజమాని ఒప్పుకున్నాడు. తెలిపారు. బారాస యువ నాయకులు ముంత శివ యాదవ్ శేఖర్, బాలకృష్ణ, చంటి, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు మీసాల శీను, డప్పు నాగరాజు, పాము నాగులు, మీసాల గంగోలి, పాలు, ఇంకా తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి



**మహబూబబ్‌నగర్, ఆగస్టు16, ప్రభాతర్త:** స్వాతంత్ర సమరయోధులు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, కార్మిక నేత స్వర్గీయ సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి మోడల శ్రీనివాస్ సాగర్ వివిధ కుల సంఘ నాయకులు, పెద్దలు, విద్యార్థి సంఘ నాయకులతో కలిసిఘనంగా జయంతి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ సాగం మాట్లాడుతూ భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ అని పిలిపించుకునేంత గౌరవం దక్కించుకున్న వ్యక్తి గౌతులచ్చన్నఅని, అనేక మందిజాతీయ నాయకులతో కలిసి స్వాతంత్ర ఉద్యమంలో చురుగ్గా పాల్గొని చాలా నెలలుగా జైలు జీవితం గడిపిన గొప్ప కార్యదీక్ష పరుడు సర్దార్ గౌతు లచ్చన్న అని వారు కొనియాడారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, జాంగ్ర సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు మహేందర్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, రజక సంఘం నూతన అధ్యక్షుడు దుర్గేష్, రజక సంఘం పట్టణ అధ్యక్షుడు మల్లేష్, బిసి విద్యార్థి సంఘం మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు దోమ వెంకటేష్ పద్మశాలి సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి సుకుమార్, గౌడ సంఘం నాయకులు వేణుగౌడ్ పాల్గొన్నారు.

## స్వయంభు శ్రీ కృష్ణ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**మల్దకల్ ఆగస్టు 16, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం సద్దలోనిపల్లి గ్రామంలోని శనివారము స్వయంభు శ్రీకృష్ణ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 6గంటలకు బిందెసేవ, స్వామివారికి అభిషేకం రాత్రి12 గంటలకు కృష్ణ స్వామి జననం, భాగవతం, గీతా పారాయణం, ప్రభోత్సవం, తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. మూడు రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అన్ని ఏర్పాట్లును పూర్తి చేసింది. ఆయాగ్రామాల నుండిభక్తులు భక్తాదులుస్వామివారిని దర్శించుకోవడానికి ఇక్కడ వచ్చి మొక్కుబడులను తీర్చుకుంటారు. ఆలయ ఈవోపురేందర్‌కుమార్ గ్రామప్రజల ఆధ్వర్యంలోఉత్సవాలు ఘనంగా జరుగుతాయి.

# 42శాతం బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

### బండి సంజయ్ బీసీలకు క్షమాపణ చెప్పాలి : సిపిఎం మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి

**వీపనగండ్ల, ఆగస్టు 16, ప్రభాతవార్త;** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం బీసీలకు 42 రిజర్వేషన్ కు చట్టబద్ధత కల్పించకుండా బీసీలకు వ్యతిరేకంగా బిజెపి మాట్లాడుతుందని సిపిఎం పార్టీ వీపనగండ్ల మండల కార్యదర్శి దొడ్ల బాల్‌రెడ్డి అన్నారు. సిపిఎం పార్టీ వీపనగండ్ల మండలం కమిటీ సమావేశం శనివారం నాడు ఆ పార్టీ మండల కార్యాలయంలో కామ్రేడ్ ఎం కృష్ణయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న బిజెపి, 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించకుండా పార్లమెంట్లో రాజ్యాంగ సవరణ చేయక పోవడం, బీసీల పట్ల వ్యతిరేక భావజాలాన్ని బహిర్గతం చేస్తోందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానంపై గవర్నర్ సంతకం చేసి రాష్ట్రపతికి పంపిన ఆమె దాన్ని ఇప్పటివరకుపట్టించుకోలేదని ఆయనఅన్నారు ఇది కేంద్ర ప్రభుత్వంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కావాలని బీసీలపై అనైక్యత ప్రదర్శిస్తున్నాడని ఆయన తీవ్రంగా విమర్శించారు తెలంగాణ నుండి బీజేపీకి చెందిన 8మంది ఎంపీలు పార్లమెంట్లో నోరు మెదపక పోవడం, కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయలేము" అని చెప్పడం సిగ్గుచేటు చర్య అని పేర్కొన్నారు. వెంటనే బండి సంజయ్ బీసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీహార్‌లో జరుగుతున్న ఎన్నికల్లో పెద్ద ఎత్తున నకిలీ ఓటర్లను సృష్టించి అధికారంలోకి రావడానికి రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ అధికారంలో ఉన్న అనేక రాష్ట్రాల్లో దళితులు, గిరిజనులు, మైనార్టీలు, అణగారిన వర్గాలపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని, మనువాద భావజాలంతో రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు చేస్తున్నారని తెలిపారు. బీసీల రిజర్వేషన్లను రద్దు చేయాలనే బీజేపీ యత్నాలను ప్రజలు అర్థం చేసుకుని, పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంద్రమ్మ ఇల్లు వ్వాలని, ఎండాకాలం వరి బోనస్ డబ్బులు వేయాలని, కొంతమంది రైతులకు రైతు భరోసా అందలేదు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక ఎన్నికల్లో సిపిఎం స్వతంత్రంగా పోటీ చేస్తుందని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు మండ్ల కృష్ణయ్య, మహబూబ్‌బాషా, రవిప్రసాద్, మండల కమిటీసభ్యులు బాలగౌడ్, వి కృష్ణయ్య, సిహెచ్ వెంకటయ్య, ఆశన్న, ఖాజాహుస్సేన్, ఈశ్వర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యల పరిష్కారానికై నిరంతర ఉద్యమాలు


రైతు సంఘం రాష్ట్ర మహాసభల గోడపత్రికను విడుదల చేస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ ఆగస్టు16, ప్రభాతవార్త;** వ్యాప్తంగా రైతు లేని కుటుంబ సమస్యల పరిష్కారం కోసం అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు చేసేందుకు సమయత్వం కావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కే రాజన్న విజ్ఞప్తి చేశారు. ఈనెల 25 , 26 తేదీలలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర రైతు సంఘం మహాసభలు జరగనున్న నేపథ్యంలో శనివారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో రాష్ట్ర మహాసభల గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైపు రైతులు యూరియా దొరకక తీవ్ర ఇక్కట్లకు గురవుతుంటే రాష్ట్ర మంత్రులు తమకేమీ పట్టనట్లుగా కేవలం పత్రిక ప్రకటనలు గుర్తిస్తూ ఎక్కడ యూరియా కొరత లేదంటూ ప్రకటించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. 2023 లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో పూర్తిగావిఫలమైందని రైతులకు రుణమాఫీ పూర్తి చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని ఆరోగ్యారెంటీలు అమలు చేయకుండా ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ కలయాపన చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు. రైతాంగ సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి ఎందుకే అఖిల భారత రైతు సంఘం మహాసభలో జరుపుతున్నట్లుగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు ఆంజనేయులు, కురుమన్న, వెంకటయ్య, సల్వా రెడ్డి, పియుసిఐ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు సిరాజు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా కొరతను తీర్చాలి

### ఐక్య రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కె రాజన్న


మాట్లాడుతున్న ఐక్య రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కే రాజన్న

**అమరచింత ఆగస్టు 16, ప్రభాతవార్త:** వర్షాకాలం సీజన్లో పంటలు వేసుకున్న రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా కొరతను తీర్చాలని అఖిలభారత ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, కే రాజన్న కోరారు. శనివారం అమరచింత మండలంలోని సింగంపేట, కృష్ణంపల్లి, అమరచింతలో అఖిలభారత రాష్ట్ర మహాసభల పోస్టర్ విడుదల చేశారు. అనంతరం మార్క్స్ భవనంలో కే రాజన్న మాట్లాడుతూ, కేంద్ర, రైతు సంక్షేమ ప్రభుత్వాలని చెప్పుకుంటున్న దేశానికి అన్నం పెట్టే రైతన్నలకు యూరియా సరఫరా చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. రైతులు తెల్లవారుజాము నుండి పడిగాపులు కాస్తున్న పట్టించుకోకపోవడం ఆయన అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు, డాక్టర్ వాకిటి శ్రీహరి చొరవ తీసుకొని రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా యూరియా కొరతను తీర్చాలని ఆయన కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన రైతు వ్యతిరేక చట్టాలను ఆయన డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ఈనెల 25,26 రెండు రోజులపాటు అఖిలభారతఐక్య రైతు సంఘం మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని ఈ మహాసభలకు ఉమ్మడి జిల్లాలో ఉన్న రైతులు భారీగా హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిరాజు, వెంకటయ్య, కురుమన్న, వెంకటన్న, మల్లేష్, సర్వారెడ్డి, లింగన్న, బిరాజు, కురువనరసింహ పాల్గొన్నారు.

# భక్త జన సందోహం మధ్య రథోత్సవం


రథోత్సవాన్ని లాగుతున్న భక్తులు

**వంగూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త:** భక్త జనసందోహం మధ్య డప్పు మేళాల, వేద పండితుల మంత్రోచ్ఛరణలతో రథోత్సవ కార్యక్రమాన్ని కన్నుల విందుగా నిర్వహించారు. వంగూరు మండల కేంద్రంలోని శ్రీగెల్వలాంబ మాతబ్రహ్మోత్సవాలు గత 3రోజులుగా ప్రశాంతంగా కొనసాగాయి. 4వ రోజు మంగళవారం రథోత్సవ కార్యక్రమాన్నిఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు గోవింద నామస్మరణ, శ్రీగెల్వలాంబ మాత నినాదాలతో రథోత్సవాన్ని లాగుతూ తమ భక్తిని చాటుకున్నారు. పోటా పోటీన ప్రజలు తమ వైపే గ్గాలని ఆనందోత్సవంతో రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

**ఎస్ఐ మహేందర్‌కు ఘన సన్మానం:** గెల్వలాంబ మాత బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ మహేష్‌ల ఆధ్వర్యంలో గట్టిబందోబస్తును నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున నిర్వహించినరథోత్సవ కార్యక్రమంలోఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో భక్తులతో కలిసి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని బందోబస్తు నిర్వహించిన ఎస్ఐ మహేష్‌తో పాటు పోలీస్ శాఖ సిబ్బందిని ఆలయ చైర్మన్ నకినమోని శేఖర్‌ముదిరాజ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు తదితరులు ఉన్నారు.

## చౌడేశ్వరి దేవి ఆలయానికి రోడ్డుమర్మత్తులు చేపట్టండి

### -సుగుర్ గ్రామస్తుల విజ్ఞప్తి


గుంతల మాయంగా ఉన్న రోడ్డు


బురదమయమైన రోడ్డు మార్గంలో పుట్ట మనకు వెళుతున్న ప్రజలు

**పెబ్బేర్ ఆగస్టు 16 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం పాత సుగురు గ్రామంలో శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి ఆలయానికి వెళ్లే దారిని రోడ్డు పనులు చేపట్టాలని ఎన్నోసార్లు వినతి పత్రం అందించిన అధికారులు స్పందించడం లేదని, ఈ రోడ్డు మార్గాన వ్యవసాయదారులకు, చౌడేశ్వరి దేవి ఆలయానికి, స్మశాన వాటికకు, ఎస్సీ కాలనీకి ఈ రోడ్డు మార్గంలో వెళుతుంటారని ఈ రోడ్డులో వెళ్లాలంటే చాలా ఇబ్బంది కరంగా, రోడ్డు మొత్తం గుంతల మయంగా నీళ్లు ఆగి బురద ఉండడం వలన నడవాలంటే రోడ్డు చాలా ఇబ్బంది కరంగా ఉందని ఏదైనా శవాన్ని ఆ రోడ్డు మార్గాన తీసుకెళ్లాలంటే నరకప్రాయంగా ఉందని ప్రజలు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, వనపర్తి ఎమ్మెల్యే మేగారెడ్డి స్పందించి త్వరగా రోడ్డు మరమ్మత్తుల నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూగురు గ్రామ ప్రజలు, చౌడేశ్వరిదేవి ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ విషయాన్ని ఏఈ కార్తీక్‌ను వార్త ప్రతి నిధి వివరణ కోరగా ఈ రోడ్డుకు ప్రపోజల్ పంపించమని దానికి ఫండ్స్ రిలీజ్ అయితే వెంటనే రోడ్డు పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలియజేశారు.

## సర్ధార్ సర్వయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న మండల అధ్యక్షులు మాచర్ల శ్రీనివాస్‌గౌడ్

**పెబ్బేరు, ఆగస్టు 16 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలంలో నిర్వహించే సర్దార్ సర్వయి పాపన్న గౌడ్ 375వ జయంతిని ఆగస్టు 18న సోమవారం సుభాష్ చంద్రబోస్ చౌరస్తాలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మండల అధ్యక్షులు మాచర్ల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక గౌడ పంక్షన్ హల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వానికి ధన్యవాదములు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరపాలని నిర్ణయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహణ కోసం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం నర్సాయిపల్లి గ్రామానికి చెందిన రేవతిగౌడ్‌ను సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 జయంతి ఉత్సవాలు కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా ప్రభుత్వం నియమిచడం హర్షించదగిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మాచర్ల శ్రీనివాస్ గౌడ్, వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్, గీత కార్మిక సహకార సంఘం అధ్యక్షుడు ఎస్.రామన్ గౌడ్, శివశంకర్ గౌడ్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, ఉమేష్ గౌడ్, రమేష్ గౌడ్, శ్యామ్ సుందర్ గౌడ్, రాజాగౌడ్, జి.భాస్కర్ గౌడ్, ఎన్.వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## రెండో విడత లైసెన్స్ సర్వేర్లకు శిక్షణ

● గద్వాల జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్

**గద్వాల టౌన్, ఆగస్టు16, ప్రభాతవార్త:** లైసెన్స్ సర్వేయర్ల రెండో విడతలో ఎంపికైన 130 మంది అభ్యర్థులకు 50 రోజుల శిక్షణ ఆగస్టు18 నుండి ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ అకాడమీ ఆఫ్‌ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ తాలిమ్, హైదరాబాద్ ఆధ్వర్యంలో లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుచున్నదని తెలిపారు. ఈ సందర్భంగా రెండవ విడతలో ఎంపికైన 130 మంది లైసెన్స్ సర్వేయర్లకు శిక్షణ ఈ నెల 18 నుండి అక్టోబర్ 22 వరకు మొత్తం 50 పనిదినాలు గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణకు హాజరయ్యేఅభ్యర్థులు ఈ నెల 18న ఉదయం 10:00గంటలకు పాత ఎంపీడీఓ కార్యాలయం, అంబేద్కర్ చౌక్, గద్వాల జిల్లా కేంద్రంలోని మీటింగ్ హాల్ వద్ద హాజరు కావాలని అన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు, ప్రభుత్వ సివిల్ సర్జన్ జారీ చేసిన ఫిట్‌నెస్ సర్టిఫికేట్, రెండు తాజా పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తప్పనిసరిగా తీసుకురావలసి ఉంటుందని పేర్కొన్నారు. మొదటి విడతలో శిక్షణ పొందిపరీక్షలు వ్రాసి ఉత్తీర్ణత సాధించని లైసెన్స్ సర్వేయర్ అభ్యర్థులు తాము ఫెయిల్ అయిన సబ్జెక్టులకు మాత్రమే సప్లిమెంటరీ పరీక్షలు రాయవలసి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు జిల్లా సర్వే కార్యాలయం, జోగుళాంబ గద్వాల లేదా 9849720811, 9985866499 నంబర్లను సంప్రదించగలరని తెలిపారు.

## బీజేపీ జిల్లా కమిటీ సభ్యుల నియామకం

**మహబూబ్‌నగర్ ఆగస్టు16, ప్రభాతవార్త:** బిజెపి పాలమూరు జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ రెడ్డి జిల్లా కమిటీ సభ్యులని నియమిస్తూ శనివారం అధికారికంగా విడుదల చేశారు. జిల్లా ఉపాధ్యక్షులుగా భరత్ భూషణ్. (కొత్తకోట), చిల్ల గాల్ రెడ్డి మొల్గర, క్రిస్టియనాయక్, కురువ రమేష్ (సీసీ కుంట), రాపోతుల శ్రీనివాస్‌గౌడ్, కొండ బుచ్చిరెడ్డిని నియమించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొత్తకోట కిరణ్ కుమార్ రెడ్డి, నాగిలి రమేష్ కుమార్, ఎన్ రాజేశ్వర్. జిల్లా కార్యదర్శులుగా పద్మ వేణి, సబి రెడ్డి నారాయణమ్మ (కొత్తకోట), తాటి వెంకటేశ్వరమ్మ, సంఘాల రవీందర్‌రెడ్డి (రేకులంపల్లి), జిఅశోక్ కుమార్, పోతుల రాజేందర్ రెడ్డిని నియమించారు. జిల్లా కోశాధికారిగా డాక్టర్ వెంకటయ్య (హన్వాడ), జిల్లా కార్యాలయ ప్రముఖ్ జాజం సుబ్రహ్మణ్యం, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్‌గా పతంగే విశాల్, మీడియా సెల్ జిల్లా కన్వీనర్ కె.సతీష్ కుమార్, ఐటీ సెల్ జిల్లా కన్వీనర్‌గా వడ్ల శ్రీధర్(హన్వాడ)గానియమిస్తూ శనివారం ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులను మరియు జిల్లా మోర్చాల కమిటీసభ్యులను త్వరలో నియమించి ప్రకటించడం జరుగుతుందని తెలిపారు.

## 13వ వార్డులో తాగునీటి ఇబ్బందులకు చెక్


బోరు వేయిస్తున్న కౌన్సిలర్ నందకిషోర్‌గౌడ్

**జడ్చర్ల, ఆగస్టు16, ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డ్ రంగారావు తోట వద్ద కాలనీవాసులకు నీటి ఇబ్బంది ఉండకుండా మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సహకారంతో కౌన్సిలర్ నందకిషోర్ గౌడ్ బోరు వేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మార్కెట్ డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు జయరాజ్ ,బోరవెల్లి సాయిరాం, కాలనీవాసులు శేఖర్, యాదయ్య పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్‌కు అభినందనలు తెలిపిన దేవరకద్ర ఎమ్మెల్యే



**దేవరకద్ర, ఆగస్టు 16, ప్రభాతవార్త:** దేవరకద్ర మండల కేంద్రంలోని, స్థానిక పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్‌కు ఉత్తమ ప్రశంసా పత్రం అందజేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, జిల్లా ఎస్పీ జానకి చేతుల మీదగా పోలీస్ ఉద్యోగ ధర్మాన్ని నీతి నిజాయితీలతో నిర్వర్తించి, విధి నిర్వహణలో సమర్థవంతంగా పనిచేసేందుకు 79వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి మధు సూదన్ రెడ్డి ఉత్తమ ప్రశంసాపత్రం అందుకున్న రాజశేఖర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మాజీ జెడ్పిటిసి లక్షీ ్మకాంత్‌రెడ్డి, ఆదిహనుమంత్‌రెడ్డి, అంజన్ కుమార్‌రెడ్డి, చైర్మన్ నరసింహారెడ్డి, రాంపండు, ఫరూక్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థల మార్పుపై ఎంపికి వినతి


ఎంపి డీకే అరుణకు వినతిపత్రం అందజేస్తున్న సంతోష్‌రెడ్డి

**చిన్న చింతకుంట, ఆగస్టు16, ప్రభాతవార్త;** మండల కేంద్రంలోని దమగ్నాపూర్ సమీపంలోని ఎర్రగుట్ట వద్ద ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణ స్థలం మార్పు చేయాలని మహబూబ్నగర్ పార్లమెంటు సభ్యులు డీకే అరుణకు బీఎస్పీ నేత సంతోష్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. శనివారం మండల కేంద్రంలో అభివృద్ధి పనుల గాను ఎంపీ రావడంతో ఇంటిగ్రేటెడ్ స్కూలు స్థలం మార్పుపై ఎంపీని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు .పక్కనే ఇంతనాలు కంపెనీ ఉందని తద్వారా 2500 మంది విద్యార్థులకు అనారోగ్య బారినపడే అవకాశాలు ఉన్నాయని ఎటువంటి సౌకర్యాలు లేని ధమగ్నాపూర్ లో నిర్మిస్తున్నారని దీనిపై దృష్టిసారించాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణ జరిపి సౌకర్యాలు ఉన్నచోట ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మాణం చేయాలని ఎంపీ ని కోరడం జరిగిందన్నారు.

## మహిళ అదృశ్యం

**భూత్పూర్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన బోయ చెన్నమ్మ(58) అనే మహిళ గత రాత్రి నుంచి ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, ఆమె కొంత కాలంగామతిస్థిమితం లేకుండా ఉందని భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. అదృశ్యమైన బోయ చెన్నమ్మ కుమారుడు బోయశ్రీహరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

# కన్నుల పండువగా శ్రీకృష్ణ జన్మాష్టమి

◆ ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు ◆ పలుచోట్ల అలరించిన ఉట్టికొట్టే కార్యక్రమం



జడ్చర్ల: వేడుకల్లో పాల్గొన్న కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి, కాలనీవాసులు

**భూత్పూర్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** శ్రీకృష్ణాష్టమి సందర్భంగా భూత్పూర్ మండలం మద్దిగట్లలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి ఆయన సతీమణి కవిత దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరై శ్రీకృష్ణభగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో పుష్పాలంకరణలతో అందంగాఅలంకరించిన చిన్ని కృష్ణుని రథయాత్ర, శోభాయాత్ర నిర్వహించారు. ఈ శోభాయాత్రకు గ్రామానికి చెందిన భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో త్రేత సిద్దాంతప్రభోద సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక మద్దిగట్లశాఖ నిర్వహకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్‌లతో పాటు కాంగ్రెస్ నాయకులు హరియా నాయక్, వడ్డె శ్రీనివాసులు, రావులపల్లి నర్సింములు, బోరింగ్ నర్సింహులు, గడ్డం ఎల్లప్ప, గడ్డం యాదయ్య, ఎర్రవాపు నర్సింహులు, రవీందర్‌రెడ్డి, వేణు, రాంరెడ్డి, వెంకటేష్, తమన్న గౌడ్, దెంది లక్ష్మీకాంత్‌రెడ్డి, సంజీవరెడ్డి, మాసగౌడ్, టీవీరెడ్డి, తిరుపతిరెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**భూత్పూర్ ఠాగూర్ మెమోరియల్ స్కూల్‌లో:** శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని భూత్పూర్ బీసీకాలనీలోని ఠాగూర్ మెమోరియల్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు గోపికమ్మలు, చిన్ని కృష్ణుల వేషధారణలతో పలువురిని అలరించారు. చిన్నారుల నృత్యాలు అలరించాయి. చిన్ని కృష్ణులుగా కాట్రావత్ వినోద్, చైత్రలు అద్భుతంగా అభినయించారు. గోపికలుగా చీపుర్ల కార్తీక, చీపుర్ల హర్షిక, కర్నెకోట నేహశ్రీ, గొడుగు సాయిసంకీర్తన, అనుర్విన్య, సిరిగిరి దీప్తి, సిరిగిరి అక్షిత, వడ్డెవాట్ సింధు తదితరులు అద్భుతంగా అభినయించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఇక పాఠశాలకు చెందిన గొడుదు సంజీవ, చీపుర్ల ప్రణీత్, బోయ విష్ణు, కాట్రావత్ గౌతమ్, మాల్యా అరవింద్, రాచూరి బాలు, రాచూరి పవన్, కప్పెరి అభి, కప్పెరి థామస్(కార్తీక్), భరత్ తదితరులు ఉట్లు కొట్టి కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న చిన్నారులను పాఠశాల కరస్పాండెంట్ గొడుగు వెంకటయ్య, ప్రిన్సిపాల్ కాడ్లూర్ చాముండేశ్వరి ఇతర ఉపాధ్యాయులు, తల్లితండ్రులు అబినందించారు.

**జడ్చర్ల, ఆగస్టు16, ప్రభాతవార్త:** బాదేపల్లి పట్టణం సంతోష్ మాత దేవాలయంలో శనివారం శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకృష్ణుడికి అభిషేకం అలంకరణ, డోలా రోహనం, తులాబారం చేశారు. చిన్ని కృష్ణులు వేషధారణ గొల్లభామ వేషధారణ చిన్నారుల వేషధారణ అందర్నీ ఆకట్టుకుంది. మహ మంగళ హారతి అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. పద్మావతి కాలనీ విద్యానగర్ కాలనీ కోలాటాలతో శ్రీకృష్ణునికి ఆలయం చుట్టూ ఊరేగింపు చేశారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ శ్రీనివాసులు, సుజాత, కౌన్సిలర్ కోట్ల ప్రశాంతరెడ్డి, సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ ప్రవీణ్, శీను, ఆలయపూజారులు పూర్ణ దామోదర్ పాల్గొన్నారు





శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం

**చిన్న చింతకుంట, ఆగస్టు16, ప్రభాతవార్త;** కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని లాల్కోట చౌరస్తాలో గల గౌతం మోడల్ స్కూల్ లో చిన్నారులు కృష్ణాష్టమి వేడుకలను ఎంతో సరదాగా జరుపుకున్నారు. చిన్నారులు శ్రీకృష్ణుని వేషాధారణ ఎంతగానో ఆకట్టుకుంది. పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూర్యచంద్ర పౌండేషన్ అధినేత సూర్య మోహన్ రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ రాధిక తోపాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

**దేవరకద్ర, ఆగస్టు 16, ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం గోపన్ పల్లి గ్రామంలో శ్రీకృష్ణ జన్మష్టమిని పురస్కరించుకొని చిన్నారులు కృష్ణా, రాధా, మరియు గోపిక వేషధారణలతో అలరిం చారు. అనంతరం విద్యార్థులు పాల ఉట్టిని కొట్టి వేడుక లు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మఠం సురేష్ స్వామి మాట్లాడుతూ పాఠశాలలో, గ్రామాలలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ద్వారా విద్యార్థులకు, పండుగలు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు తెలుస్తాయి అన్నారు. హిందూ ఇతిహాసాలలో శ్రీమహావిష్ణువు ఎనిమిదవ అవతారం శ్రీకృష్ణుడి జన్మదినం. కృష్ణ జన్మాష్టమిని, కృష్ణాష్టమి, గోకులష్టమి, అష్టమి రోహిణి అని పిలుస్తారు. అదేవిధంగా కృష్ణాష్టమి రోజున భక్తులు ఉపాసముండి శ్రీకృష్ణుడిని పూజిస్తారు. శ్రావణమాసంలో లభించే పనులు అటుకులుబెల్లం కలిపిన వెన్న పెరుగుమీగడను నైవేద్యంగా సమర్పిస్తారు. ఉయ్యాల కట్టి అందులో శ్రీకృష్ణుని విగ్రహాన్ని పడుకోబెట్టి రకరకాల పాటలు కీర్తనలు అలిపిస్తారు. ద్వారక యుగంలో జన్మించిన శ్రీకృష్ణుడు నేటి కలియుగానికి ఆదర్శమూర్తిగా నిలుస్తున్నాడు. అందుకే ఆయనను అందరూ ఇష్ట దైవంగా కొలుస్తున్నారని గోపన్ పల్లి మఠం సురేష్ స్వామి అన్నారు.



మద్దిగట్ల శ్రీకృష్ణాష్టమి వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్

**అమరచింత ఆగస్టు 16. ప్రభాతవార్త;** అమరచింత మున్సిపల్ కేంద్రంలోని శ్రీకృష్ణ నగర్ లోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర ఏర్పాటుచేసిన శ్రీ కృష్ణ జన్మాష్ట వేడుకలు ఉట్ల కార్యక్రమం యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అలాగే శ్రీకృష్ణ దేవాలయం నుండి యాదవులు భక్తిగీతాలు పాడుతూ ఆంజనేయ స్వామి దేవాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ పిల్లల్ని గ్రామ ప్రజలు భారీగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అమరచింత యాదవ సంఘం అధ్యక్షులు జింక రవి, రాజు, నాగరాజు, విజయ్ యాదవ్, నరసింహులు, రవి, విష్ణు యాదవ్, విష్ణు, కాంగ్రెస్ యాదవులు వారీగా పాల్గొన్నారు.

**నారాయణపేట టౌన్, ఆగస్టు16, ప్రభాతవార్త;** నారాయణపేట పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో శనివారం శ్రీ కృష్ణాష్టమి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు బాలబాలికలు కృష్ణ గోపిక వేషాధారణలో ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని వైభవంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానా చార్యులు ఆచార్యులు విద్యార్థి బృందం పాల్గొనడం జరిగింది.

**ఉప్పునుంతల, ఆగష్టు 16, ప్రభాతవార్త;** శ్రావణమాసం చివరి వారంలో వచ్చే శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలో నీ ఉప్పునుంతల, వెల్టూరు, పెనిమె ళ్ళ, మామిళ్ళ పల్లి, మర్రి,పల్లి, లక్ష్మాపూర్ తదితర గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చాలా గ్రామాల్లో శ్రీకృష్ణుని ఊరేగించి ఉత్సవాలు నిర్వహించారు. ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించుకున్నారు. వెల్టూరు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర ఆలయం ముందు భజన మండలి ఆధ్వర్యంలో భజనాల, కోలాటాల మధ్యన శ్రీకృష్ణుని జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.





శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన చిన్నారులు



శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం





అమరచింతలు యాదవ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ

## బీజేపీ జిల్లా ఉపాధ్యకుడిగా గాల్‌రెడ్డి

**భూత్పూర్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బీజేపీ సీనియర్ నాయకుడు, కొత్తమొల్గర గ్రామానికి చెందిన గాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు ఇరవై మందికి జిల్లా కమిటీలో చోటు కల్పిస్తూ ఉత్తర్వు జారీ చేశారు. ఇందులో ఆరుగురికి ఉపాధ్యక్షులుగా, ముగ్గురికి ప్రధాన కార్యదర్శులుగా, ఆరుగురికి జిల్లా కార్యదర్శులుగాను, కోశాధికారిగా ఒకరికి, కార్యాలయ కార్యదర్శిగా ఒకరికి, సోషల్ మీడియా ఇంచార్జీగా ఒకరికి, మీడియా కన్వీనర్‌గా ఒకరికి, ఐటీ ఇంచార్జీగా ఒకరికి అవకాశం కల్పించారు. ఇందులో జిల్లా ఉపాధ్యక్షుడిగా భూత్పూర్ మండలం కొత్తమొల్గరకు చెందిన గాల్‌రెడ్డికి అవకాశం కల్పించారు.

## యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ కె రాజ్‌కుమార్‌రెడ్డి



**నారాయణపేట టౌన్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** డ్రగ్స్, మద్యం నుండి యువతను కాపాడుకుందాం. నవభారతాన్ని నిర్మించుకుందామని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ కె రాజ్ కుమార్ రెడ్డి అన్నారు. భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ తో పాటు సభ్యులతో కలిసి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ చదువులు పూర్తయిన తర్వాత యువత భవిష్యత్తుపై దృష్టి సారించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా డ్రగ్స్, మత్తు పదార్థాల వైపు వెళ్లొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ గడ్డం తిప్పన్న, బాలాజీ, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, సల్ల వెంకటేష్, వై.సంతోష్, శివరాజ్, నర్సింహనాయుడు, అశోక్, ఎం.సంతోష్, నందుకుమార్, నర్సింహ, శ్రీనివాస్, జేకే.అనిల్, నాగరావు, చామకూర నగేష్, రాజప్పగౌడ్, హరికృష్ణ ప్రభూజీ, రాజు, రాంకోటి తదితరులు పాల్గొన్నారు.

## మత్స్య కార్మికుల జిల్లా స్థాయి సమావేశం విజయవంతం చేయాలి

● వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతల నాగరాజు



**ఉప్పునుంతల, ఆగష్టు 16, ప్రభాతవార్త;** నేడు ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా స్థాయి మత్స్య కార్మికుల సమావేశం విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతల నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని కంసాని పల్లి లో మత్స్య కార్మికులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయి సమావేశం పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో జరిగే సమావేశానికి అత్యధికంగా మత్స్యకారులు హాజరై, వారి స్థితిగతుల పై జరిగే సమావేశానికి మండలం నుంచి అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కంసానిపల్లి లో జరిగిన మత్స్య కార్మికుల సమావేశం లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాసహాయ కార్యదర్శి చింతలనాగరాజుతో పాటుమత్స్యకార్మికుల సంఘం నాయకులు మాడిశెట్టి నారాయణ, చీమలవెంకటయ్య ( సి.ఎం), వందరి సత్యం, అర్జునయ్య, సీమర్ల తిరుపతయ్య, గొర్ల హుస్సేన్, గొర్ల రేణయ్య, శివ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి మిస్సింగ్ : కేసు నమోదు

**పెబ్బేర్ ఆగస్టు 16 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణానికి చెందిన ప్యారసాని సత్యనారాయణ అనే వ్యక్తి తమిళనాడులోని అరుణాచలం (తిరువన్నామలై) వెళ్తున్నానని చెప్పి ఇప్పటి వరకు ఇంటికి తిరిగిరాలేదు. ఈ విషయమై వారి కుటుంబ సభ్యులు పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 12న ఫిర్యాదు చేశారు. పెబ్బేరు ఎస్సై యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు పట్టణానికి చెందిన పి.సత్యనారాయణ ఈనెల 3వ తేదీన తిరువన్నామలై వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి గద్వాల్లో ట్రైన్ ఎక్కి వెళ్లాడు. 5వ తేదీ వరకు ఇంట్లో వాళ్లతో ఫోన్లో టచ్లో ఉన్నాడు. ఆ తరవాత అందుబాటులోకి రాలేదు. అతడు రెగ్యులర్‌గా తీర్థయాత్రలకు వెళ్తూ వస్తూ ఉంటాడు. ఈ క్రమంలోనే తిరిగివస్తాడు కదా అని కుటుంబ సభ్యులు అనుకున్నారు. కానీ రాకపోవడంతో ఈ నెల 12న అతడి తల్లి సుశీలమ్మ పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నా ఆచూకీ లభించడంలేదు. ఎవరికైనా ఇతడు కనిపిస్తే ఫోన్ నంబర్లు : 96718862305, 9381944500, 8712670624 లను సంప్రదించాలని కోరారు.

# వంతెన నిర్మిస్తే.. ఇబ్బంది ఉండదు

◆ కర్ని చెరువు అలుగుపారుతే రోడ్డుకు ఇరువైపులా ట్రాక్టర్లు అడ్డంపెట్టి వెళ్లకుండా ఆపే పరిస్థితి!

◆ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుకుంటున్న గ్రామాల ప్రజలు



వంతెన లేకపోవడంతో ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు (ఫైల్)

**మక్తల్ టౌన్, ఆగస్టు 16ప్రభాతవార్త:** గత కొన్ని రోజులుగా భారి వర్షాల కారణంగా కర్ని చెరువు ఉధృతంగా అలుగుపారుతున్న సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా ట్రాక్టర్లు అడ్డంపెట్టి ప్రజల్ని వెళ్లకుండా ఆపేసి అధికారులు ప్రజలను నిలువరించారు. ఇది ప్రతి సంవత్సరం జరుగుతున్నటువంటి తంతు సంబంధిత అధికారుల నుండి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం చేత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనీ గ్రామస్తులు తెలిపారు. దాదాపు 13 గ్రామాల ప్రజలు అనారోగ్యంతో బాధపడుతూ ఏదైనా ఎమర్జెన్సీ వస్తే మక్తల్ చేరుకోవాలంటే తప్పకుండా పారేవుల చిట్యాల కర్ని దగ్గర చెరువులు అలుగులు దాటాల్సిన పరిస్థితి ఉంటుంది కావున, ఇట్టి పరిస్థితులలో ఏ విధంగా మక్తల్ చేరుకోవాలి ఎన్నో సంవత్సరాల నుంచి అధికారులకు కనిపించట్లేదా వర్షాకాలం వస్తేనే గుర్తు వస్తుందనీ ప్రజల బాధలు అధికారులకు పట్టించు కావాలని, అత్యవసర చికిత్స కోసం ఎవరైనా అర్ధరాత్రి వెళ్లాల్సిన పరిస్థితి వస్తే ఎలా వెళ్లాలిఅని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజల క్షేమం కోరి సంబంధిత శాఖ వారు శాశ్వత పరిష్కారాన్ని చేయవలసింది గా కోరారు. మక్తల్ నుండి అనుగొండ రోడ్డు మూడు గ్రామాల దగ్గర బ్రిడ్జి నిర్మాణం చేసి ప్రజలకు అంతరాయం కలగకుండా వెంటనే చర్యలు చేపట్టవలసిందిగా ప్రజలందరూ కోరుకుంటున్నారు.

# పని చేసి పది నెలలైనా.. పారితోషికం ఇవ్వడం లేదు?

**సమగ్ర కుటుంబ సర్వే సిబ్బందికి మొండిచేయి**

**నిరుడు నవంబర్‌లో పారితోషికం ఇంకా ఇవ్వని సర్కారు**

**సార్ మా డబ్బులు ఎప్పుడు వస్తాయంటూ ఆరా ?**

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 16 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని గత ఏడాది నవంబర్‌లో నిర్వహించింది. సమగ్ర కుటుంబ సర్వే చేసిన ఎన్యుమరేటర్లకు, సూపర్‌వైజర్లకు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ప్రత్యేకంగా గౌరవ వేతనం ఇస్తామని ప్రకటించింది. సర్వే జరిగి 10 నెలలు కావొస్తోంది. ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వారి బ్యాంకు అకౌంట్లో నగదు విడుదల చేయలేదు. వారు ఎంపీడీఓ కార్యాలయాలు, బల్దియా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పారితోషికం విడుదల చేయాలని కోరుతున్నారు.

**సార్ మా డబ్బులు ఎప్పుడు వస్తాయంటూ ఆరా? :** రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం నవంబరులో సామాజిక ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ, కుల సర్వే చేపట్టింది. అనంతరం డిసెంబరులో ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేశారు. సమగ్ర కుటుంబ సర్వే చేసేందుకు ఎన్యుమరేటర్లకు ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున పారితోషికంఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సూపర్‌వైజర్లకు ఒక్కొక్కరికి రూ.12,000, డేటా ఎంట్రీ ఆపరేటర్లలో ప్రభుత్వ ఉద్యోగులు అయితే రోజుకు రూ.350 చొప్పున, అదే ప్రైవేటు ఆపరేటర్లయితే ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేసిన ఒక్కో దరఖాస్తు ఫారంనకు రూ.30 చొప్పున చెల్లించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. నగదు విడుదల కాకపోవడంతో ఎన్యుమరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆర్థిక ఇబ్బందులతో ఎంపీడీఓ, ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. సార్ మా డబ్బులు ఎప్పుడు వస్తాయంటూ ఆరా తీస్తున్నారు.

కష్ట పడుఫలితం ఆశించకు " అన్నట్లుగానే ఉంది సర్కార్ తీరు.. ..రాత్రి ,పగలు తేడా లేకుండా పని చేసిన కంప్యూటర్ ఆపరేటర్లకు డబ్బులు ఇవ్వకుండా సర్కార్ ముప్ప తిప్పలు పెడుతోంది సమగ్ర కుటుంబ సర్వే దీన్ని డిజిటలైజే షన్ చేయడానికి ఆపరేటర్లకు అప్పగించింది. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన వారితో పాటు ప్రైవేట్ సంస్థలకు అప్పగించింది. మూడు షిఫ్టుల్లో పని చేయించుకొని వాళ్లు అనుకున్న టైం వరకు పనులు పూర్తి పని చేయిచుకున్నారు. ఆ తర్వాత మొహం చాటేశారు. కంప్యూటర్ ఆపరేటర్లకు ఇవ్వాల్సిన డబ్బులు అడుగుతుంటే మాత్రం మాకు తెలియదంటూ చేతులు దులుపుకుంటున్నారు . ఆపరేటర్ ఎన్నిసార్లు మెసేజ్ పెట్టినా, ఫోన్లు చేసినా అధికారులు సరిగా స్పందించడం లేదని అంటున్నారు. కష్ట పడుఫలితం ఆశించకు " అన్నట్లుగానే ఉంది సర్కార్ తీరు అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే పారితోషికం విడుదల చేయాలంటూ కోరారు.

# స్థానిక ఎన్నికల్లో సిపిఎం స్వతంత్రంగా పోటీ చేస్తుంది

**వీపనగండ్ల, ఆగస్టు 16, ప్రభాతవార్త;** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం బీసీలకు 42 రిజర్వేషన్ కు చట్టబద్ధత కల్పించకుండా బీసీలకు వ్యతిరేకంగా బిజెపి మాట్లాడుతుందని సిపిఎం పార్టీ వీపనగండ్ల మండల కార్యదర్శి దొడ్ల బాల్‌రెడ్డి అన్నారు. సిపిఎం పార్టీ వీపనగండ్ల మండలం కమిటీ సమావేశం శనివారం నాడు ఆ పార్టీ మండల కార్యాలయంలో కామ్రేడ్ ఎం కృష్ణయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి మాట్లా డుతూ దేశంలో అధికారంలో ఉన్న బిజెపి, 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించకుండా పార్లమెంట్లో రాజ్యాంగ సవరణ చేయక పోవడం, బీసీల పట్ల వ్యతిరేక భావజాలాన్ని బహిర్గతం చేస్తోందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానంపై గవర్నర్ సంతకం చేసి రాష్ట్రపతికి పంపిన ఆమె దాన్ని ఇప్పటివరకుపట్టించుకోలేదని ఆయనఅన్నారు ఇది కేంద్ర ప్రభుత్వంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కావాలని బీసీలపై అనైక్యత ప్రదర్శిస్తున్నాడని ఆయన తీవ్రంగా విమర్శించారు తెలంగాణ నుండి బీజేపీకి చెందిన 8మంది ఎంపీలు పార్లమెంట్లో నోరు మెదపక పోవడం, కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయలేము" అని చెప్పడం సిగ్గుచేటు చర్య అని పేర్కొన్నారు. బీజేపీ అధికా రంలో ఉన్న అనేక రాష్ట్రాల్లో దళితులు, గిరిజనులు, మైనార్టీలు, అణగారిన వర్గాలపై దాడులు, దౌర్జన్యా లు జరుగుతున్నాయని, మనువాద భావజాలంతో రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు చేస్తున్నారని తెలిపారు. బీసీల రిజర్వేషన్లను రద్దు చేయాలనే బీజేపీ యత్నాలను ప్రజలు అర్థం చేసుకుని, పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు వ్వాలని, ఎండాకాలం వరి బోనస్ డబ్బులు వేయా లని, కొంతమంది రైతులకు రైతు భరోసా అందలేదు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక ఎన్నికల్లో సిపిఎం స్వతంత్రంగా పోటీ చేస్తుందని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు మండ్ల కృష్ణయ్య, మహబూబ్‌బాషా, రవిప్రసాద్, మండల కమిటీసభ్యులు బాలగౌడ్, వి కృష్ణయ్య, ఈశ్వర్, నాగరాజు పాల్గొన్నారు.

## 4వ మహాసభలను విజయవంతం చేయండి



గోడపత్రిక విడుదల చేస్తున్న సిపిఐ నాయకులు

**పెబ్బేర్ ఆగస్టు16 ప్రభాతవార్త:** సిపిఐ 4వ రాష్ట్ర మహాసభలు ప్రజా సమస్యలపై పోరాటాల రూపకల్పనకు వేదిక కానుందని సిపిఐవనపర్తి నియోజకవర్గం కార్యదర్శి రమేష్ తెలిపారు. శనివారం పెబ్బేర్‌లో సిపిఐ 4వ రాష్ట్ర మహాసభల గోడ పత్రికను విడుదల చేసి మాట్లాడుతూ మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారంలో మహాసభలు ఆగస్టు 20 నుంచి 22 వరకు 3 రోజులపాటు రాష్ట్రంలో దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మహాసభ ద్వారా చర్చిస్తుందని, పరిష్కారానికి పోరాట కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అతని పేరుతో దేవుళ్ళ పేరుతో ప్రజలను మోసం చేస్తున్న బిజెపి బండారని మహాసభలో ఎండగట్టడం జరుగుతుందన్నారు. బీజేపీ వ్యతిరేక శక్తులను బలోపేతం చేసేందుకు ప్రణాళికలో రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ నాయకులు శ్రీరామ్, పెద్ద మొగులయ్య, గాంధీ, శాంతమూర్తి, పెద్ద మన్యం, రిక్షారాములు, గంధంశివ, ఎస్.చంద్రయ్య, లక్ష్మన్న గొర్ల వెంకటన్న, కృష్ణయ్య, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

## 21న గద్దర్ వర్ధంతి సభ



కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

**చిన్నంబావి ఆగస్టు 16, ప్రభాతవార్త;** తాడిత పీడిత ప్రజల కోసం కాళ్లకు గజ్జకట్టి పోరాటం చేసిన ప్రజా యుద్ధనౌక తెలంగాణ ఉద్యమకారుడు గద్దర్ రెండవ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో గద్దర్ వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలిదశ తెలంగాణ పోరాటంలో గద్దర్ పాత్ర అమోఘమని తెలిపారు. ఆయన మరణం తెలంగాణ సమాజానికి పీడిత ప్రజలకు తీరని లోటని తెలియజేశారు. పేద ప్రజల కోసం తన జీవితాన్ని ధారపోసిన గద్దర్ కు ఘనమైన నివాళులు అర్పించాలన్న ఉద్దేశంతో చిన్నంబావి మండల కేంద్రంలో 21వ తేదీ గురువారం రోజు రెండో వర్ధంతి సభను ఏర్పాటు చేశామని వారు తెలిపారు. కావున మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న కులసంఘాల నాయకులు మరియు రాజకీయ పార్టీల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బూర్గుల మునిస్వామి, కళాకారుడు వడ్డేమాన్ నరసింహ, పెద్ద మల్లయ్య మాదాసు కురువ సంఘం నాయకులు పెద్ద మల్లయ్య, బీజేపీ నాయకులు చిన్న మల్లయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దేవని రమేష్, డిఎన్ కృష్ణ, అంబేద్కర్ యువజన సంఘం నాయకుడు బక్కి కృష్ణయ్య, చిన్నమరూర్ మాజీ సర్పంచ్ రామచందర్ పాల్గొన్నారు.

## ఎస్ఐ మహేందర్‌కు ఘన సన్మానం

**వంగూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త:** గెల్వాలాంబ మాత బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ మహేష్‌ల ఆధ్వర్యంలో గట్టిబందోబస్తును నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున నిర్వహించినరథోత్సవ కార్యక్రమంలోఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని బందోబస్తు నిర్వహించిన ఎస్ఐ మహేష్‌తో పాటు పోలీస్ శాఖ సిబ్బందిని ఆలయ చైర్మన్ నకినమోని శేఖర్‌ముదిరాజ్ ఘనంగా సన్మానించారు.

